# ఏకత్వం జ్ఞానం, అనేకత్వం అజ్ఞానం

"శృణ్వంతు విశ్వే అమృతస్య పుత్రాః" మానవుడు అమృతపుత్రుడు. ఇదే సత్యాన్ని యమధర్మరాజు నచికేతునికి బోధించాడు. "నచికేతా! నీవు ఎక్కడినుంచి వచ్చావో ఆ మూలస్థానాన్ని గుర్తించు. దేహము ఒక నీటిబుడగలాంటిది. మనస్సు కేవలం చంచలమైనది. ఈ రెండింటిని విస్మరించి నీవు అతిముఖ్యమైన, మూలాధారమైన సత్యాన్ని గుర్తించు" అని చెప్పాడు.

*"మౌళిగుల్కెడు చంద్రమఃఖండ కళతోడ*
*బెడగారు గుంపెడు జడలతోడ*
*జడలలో ప్రవహించు చదలేటి జిగితోడ*
*డంబైన ఫాలనేత్రంబుతోడ*
*నల్లనేరెడువంటి నల్లని మెడతోడ*
*కరమున నాగకంకణముతోడ*
*నడుమున చుట్టిన నాగచర్మముతోడ*
*మైనిండ నలదు భస్మంబుతోడ*
*నుదుట దీర్చిన దొడ్డ కుంకుమ బొట్టుతో*
*తాంబూల రాగాధరంబుతోడ*
*ఆరు శాస్త్రములందున నందగించి*
*నల్ల కలువల హసించి కొల్లలాడు*
*మెరుగు చామనచాయల మేనితోడ....*

ఈవిధంగా జగత్తునే మురిపించే, మైమరపించే కళలతో నిండి ఉంటున్నది ఈశ్వరత్వము. అట్టి ఈశ్వరత్వాన్ని నీవు వెదకనక్కర్లేదు. అది నీవే అయిఉన్నావు. భౌతికమైన, లౌకికమైన, క్షణభంగురమైన దేహము నీవు కాదు. నిత్యసత్యమైన ఆత్మతత్త్వమే నీవు. ఈ సత్యాన్ని గుర్తించాలంటే నీవు జ్ఞానచక్షువుతో చూడాలి; చర్మచక్షువులతో కాదు. పశుపక్షిమృగాదులు,

sri sathyasai vachanamrutam

క్రిమికీటకాదులు కూడా చర్మచక్షువులతో ఈ జగత్తును చూస్తూనే ఉన్నాయి. వాటిమాదిరి నీవు కూడా కేవలం చర్మ చక్షువులతో చూస్తే ఇంక వాటికి, నీకు వ్యత్యాసమేమీ ఉండదు. అతీతమైన ఆత్మతత్త్వమును నీవు చర్మచక్షువులతో దర్శించలేవు. మనోనేత్రముకూడా శాశ్వతము కాదు. కాబట్టి, జ్ఞానచక్షువుతో నీవు చూడాలి. దేహము నీటిబుడగవలె పుడుతుంది, పెరుగుతుంది, క్షీణిస్తుంది. పుట్టి, పెరిగి, క్షీణించే దేహము నీవు కాదు. పుట్టనిది, గిట్టనిది ఒకటున్నది. అదియే ఆత్మతత్త్వము. అదియే నీ నిజతత్త్వము.

**'ఏది ఎఱిగిన సర్వంబు ఎఱుక పడునొ....'**

ఆత్మ అంటే ఏమిటని నీవు ప్రశ్నించవచ్చు. ఆత్మ అగోచరము, అనంతము, అప్రమేయము. "నిర్గుణం నిరంజనం సనాతనం నికేతనం నిత్య శుద్ధ బుద్ధ ముక్త నిర్మలస్వరూపిణం." అట్టి ఆత్మతత్త్వము ప్రతి వ్యక్తియందు, ప్రతి జీవియందుకూడను ఉంది. అదియే చైతన్యశక్తి అట్టి చైతన్యశక్తిని గుర్తించినప్పుడే నీజన్మ సార్థకమౌతుంది. మిగిలిన ప్రశ్నలన్నీ నీకు అనవసరం. లోకసంబంధమైన విషయాలనుగురించి నీవు అడుగుతున్నావు. అవన్నీ అడుగరాని విషయాలు. దేనిని తెలుసుకుంటే నీవు సర్వమూ తెలుసుకున్నవాడవవుతావో ఆ తత్త్వాన్ని గుర్తించు. ఆత్మతత్త్వాన్ని తెలుసుకుంటే ఇంక ఇవన్నీ తెలుసుకోనక్కర్లేదు.

చావుపుట్టుక లేనట్టి శాశ్వతుండు
ఆదిమధ్యాంతరహితుడనాదివాడు
తాను పుట్టక చావక చంపబడక
సర్వమునకు సాక్షియైయుండు ఆత్మవిభుడు

అట్టి ఆత్మతత్త్వాన్ని నీవు గుర్తించుకుంటే అన్నింటినీ గుర్తించినవాడవవుతావు. ఈవిధముగా యముడు నచికేతునికి ఆత్మతత్త్వమును గురించి వివరించాడు.

**'సత్యం వద, ధర్మం చర'**

చూడండి, ఈ హాలులో ఎక్కడ చూసినా బల్బులు వెలుగుతున్నాయి. బల్బులు వేరువేరుగాని, కరెంటు ఒక్కటే. అది వైరుద్వారా వెళ్లి బల్బులలో ప్రవేశించి ప్రకాశమును అందిస్తున్నది. ఈ కరెంటుకు మూలాధార మేమిటి? అదియే దివ్యశక్తి. అదేరీతిగా దేహములనే బల్బులు వేరువేరైనా



sri sathyasai vahamrutam

అన్నింటినీ ప్రకాశింపజేసేది ఆత్మతత్త్వమే. నేను అప్పుడప్పుడు చెబుతుంటాను: సత్యమనేది కరెంటు, ధర్మమనేది వైరు, శాంతి అనేది బల్బు, ప్రేమ అనేది ప్రకాశము. ఈ ప్రకాశము దేని ద్వారా వచ్చింది? ఆత్మద్వారానే వచ్చింది. కనుక మనం ఆత్మానందమును అనుభవించాలంటే మొట్టమొదట సత్యధర్మములను అనుసరించాలి. మన భారతీయ సంస్కృతిలో 'సత్యం వద, ధర్మం చర' యీ రెండే ప్రధానమైనవి. కాని ఈనాడు 'సత్యం వధ', సత్యాన్ని వధిస్తున్నారు; 'ధర్మం చెర', ధర్మాన్ని చెరసాలలో పెట్టి బీగం వేస్తున్నారు. ఇది కాదు మానవత్వం. సత్యమును పలకాలి. ధర్మమును ఆచరించాలి. పలకటము, ఆచరించటము యీ రెండింటిమధ్య ఏకత్వముండాలి.

**'దేహియె దేవదేవుడు...'**

"నచికేతా! ఈ పాంచభౌతికమైన దేహము అశాశ్వతమైనది. ఏదో ఒకనాడు ఇది నీటిబుడగలా పగిలిపోక తప్పదు. కాబట్టి, నీవు దేహముపై మమకారమును విసర్జించు. సత్యనిత్యమైన ఆత్మతత్త్వాన్ని తెలుసుకో. అది చర్మచక్షువులకు గోచరించదు. జ్ఞాననేత్రమే అతిముఖ్యమైనది. జ్ఞానమనగా ఎట్టిది? భౌతికజ్ఞానమా? లౌకికజ్ఞానమా? వస్తుజ్ఞానమా? కాదు, కాదు. 'ఏకత్వ దర్శనం జ్ఞానం.' అన్నింటియందు ఏకంగా ఉన్నది ఏదో దానిగూర్చిన ఎఱుకయే జ్ఞానము. అదే రూపనామరహితమైన ఆత్మతత్త్వము. అట్టి ఆత్మజ్ఞానమును నీవు సాధించు" అని చెప్పాడు యమధర్మరాజు. దానికి ఈ ప్రాకృతమైన సాధనలు పనికిరావు. ఈనాటి మానవులు పిచ్చివారైపోయి, ఆధ్యాత్మికసాధన పేరిట కళ్ళు మూసుకొని, చేతులు కట్టుకొని జ్ఞానాన్ని వెతుకుతున్నారు. ఈ భౌతికమైన సాధనలు కేవలం భౌతికమైన ఫలితాలనే ఇస్తాయి. ఇవన్నీ చంచలమైనవే, అనిత్యమైనవే, అసత్యమైనవే. సత్యనిత్యమైన ఆత్మతత్త్వము మనయందే ఉంటున్నది. దానిని గుర్తించాలంటే ఒక్క క్షణం చాలు. అన్నింటియందు ప్రేమతత్త్వాన్ని ముఖ్యాధారంగా తీసుకోవాలి. ఇట్టి విచారణకు ఇంద్రియములు అనేక రకాలుగా అడ్డు తగులుతుంటాయి. కాబట్టి దేహాభిమానమును క్రమక్రమేణా తగ్గించుకొని ఆత్మాభిమానమును అభివృద్ధిపరచుకోవాలి.

*దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్*
*దేహ నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్*

sri sathyasai vachanamrutam

*మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబుజూడ యా*
*దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ!*

'ఈ దేహము నాది' అనుకొంటున్నావు. ఎంతవరకు నీది? ఉచ్ఛ్వాసనిశ్వాసములు జరిగేంతవరకు నీది అనుకుంటావు. అవి నిలిచిపోయిన తరువాత ఏది నీది? ఒక్క క్షణంలో ఉచ్ఛ్వాసనిశ్వాసములు స్తంభించిపోతే ఏదీ మనకు తెలియదు. మన ఉచ్ఛ్వాసనిశ్వాసములు అహర్నిశలు 'సో-హం' (నేనే దైవం) అనే సత్యాన్ని బోధిస్తున్నాయి. కాని ఈ సత్యాన్ని మీరు గుర్తించుకోలేకపోతున్నారు. మనం 'సో' అంటూ గాలిని తీసుకుంటాము; 'హం అంటూ' గాలిని వదులుతాము. గాలిని తీసుకోవటమే జననము; వదలటమే మరణము. ఈ రెండూ లేకుండా చేసుకోవాలంటే దేహాభిమానాన్ని త్యజించాలి. ఆవిధంగా నేను చేసి మీకు చూపిస్తున్నాను. ఈ దేహానికి ఎన్నియో బాధలు కలుగుతున్నాయి. ఎన్నియో కష్టనష్టములు మీ అందరికీ జరిగినట్లుగానే ఈ దేహానికికూడా జరుగుతున్నాయి. కాని, నేను వాటిని లెక్కచేయను. లింగోద్భవము జరిగే సమయంలో భరించలేని బాధ ఉంటుందని మీరు భావిస్తున్నారు. ఉంటుంది నిజమే. కాని దానిపై దృష్టిపెట్టినప్పుడే బాధ అనిపిస్తుంది.

'ఇది నాది కాదు' అని స్థిరంగా ఉంటే ఆ బాధ గమనింపునకు రాదు. 'ఇది నా కర్చీఫ్' అని అనుకున్నప్పుడు దీనిని భద్రంగా ఉంచుకొని, దీనికి అంటుకునే మలినమునంతా శుభ్రం చేసి ఉపయోగపెట్టుకుంటాము. కాని కర్చీఫ్‌కి అంటిన మలినము నాదనుకుంటామా? అనుకోము; నాది కాదని విసర్జిస్తాము. అదేవిధంగా, నాది కాదనుకుంటే ఏ నొప్పీ ఉండదు. ఈవిధమైన బాధలు ఈ దేహానికి ఇంతవరకు ఎన్నో జరిగినాయి; తుంటిఎముకకూడా విరిగింది. అయితే, ఆ బాధలన్నీ దేహానికేగాని, నాకు కాదు. ఈవిధంగా బాధలను విసర్జించినప్పుడే మీకు శాంతి కలుగుతుంది. చేయిమీద చీమ పోతున్నదని గోక్కుంటే బాధ మరింత ఎక్కువైపోతుంది. ఇంత పెద్ద దేహాన్ని చీమ కుడితే ఎందుకింత బాధ? 'ఇవన్నీ నావి, నావి' అనుకొని భ్రమలను పెంచుకుంటున్నాము. నేత్రములు చూచినదంతా సత్యమని విశ్వసిస్తున్నాము. కాని చూసినదంతా కొంతసేపటిలో మారుతుంది. విన్నటువంటిది కొంతసేపటిలో మారుతుంది. తిన్నటువంటిది కొంతసేపటిలో జీర్ణమవుతుంది. కన్నది, విన్నది, తిన్నది ఈ మూడింటియందు శాశ్వతమైనది ఏదీ లేదు. త్రికాలములందు శాశ్వతంగా నిల్చేది ఏదో దానిని మీరు గుర్తించాలి.

sri sathyasai vachanamrutam

ఈ సత్యాన్ని పెద్దపెద్ద శ్లోకాలతో చెబితే మీకు అర్థము కాదు. మీ నిత్యజీవితములో కలిగే అనుభవాన్ని గుర్తించుకుంటే క్షణంలో సత్యము అర్థమవుతుంది.

**'ఈ దేహము నేను కాదు. నేను నేనే'**

(తుంటి ఎముక విరిగినప్పుడు) నన్ను ఆసుపత్రికి తీసుకువెళ్ళారు; ఆపరేషను చేయాలన్నారు. "ఏమైనా చేసుకోండి. ఈ దేహము నేను ధరించిన వస్త్రము లాంటిది. ఇది నాది కాదు, మీది. కాబట్టి, మీరు ఏమైనా చేసుకోండి. దేహము మీ స్వాధీనంలో ఉన్నది కాని, నేను ఎవరి స్వాధీనములో లేను. నేను నేనే" అని చెప్పాను. డాక్టర్లు చేయవలసిందంతా చేశారు. కాని నాకు ఏమాత్రం బాధ కలుగలేదు. బాధకు నేను లొంగలేదు. వస్తాయి, పోతాయని అలక్ష్యం చేసినప్పుడే ఈ దేహబాధలన్నీ తగ్గుతాయి. అట్లుగాకుండా దేహమే నేననే భ్రాంతితో "ఎట్లా బ్రతికేది? ఎట్లా భరించేది?" అని చింతిస్తే బాధలను ఏమాత్రం భరించుకోవడానికి వీలుకాదు. కనుక దేహాభిమానమును క్రమక్రమేణా తగ్గించుకోవటానికి ప్రయత్నించండి.

మీలో అనేకమంది అనేకరకములైన సాధనలు చేస్తున్నారు. సాధన అనగా ఏమిటి? దేహాభిమానమును పూర్తిగా త్యజించాలి. ఆత్మానందమును అనుభవించాలి. అది కేవలం ప్రేమనుంచే లభిస్తుంది. ప్రేమ అనేది ఒక్కటుంటే ఈ బాధలన్నీ నిర్మూలమైపోతాయి. కనుక ప్రేమను పెంచుకోండి. మిమ్మల్ని ద్వేషించే వ్యక్తి మీకు దారిలో ఎదురైనప్పుడు ఏమి చేస్తారు? మీరుకూడా ఆ వ్యక్తిపట్ల ద్వేషంతో ప్రక్కకు తప్పుకుంటే యిరువురి మధ్య ద్వేషము పెరుగుతుందేగాని, తరగదు. ఆ వ్యక్తి ఎదురు వచ్చినప్పుడు 'హలో సోదరా! ఎలా వున్నావు?' అని ప్రేమతో పలుకరించండి. అప్పుడు వానిలోకూడా ప్రేమ ఉద్భవిస్తుంది. ప్రేమ ఏర్పడిన తరువాత ఇరువురి మధ్య ద్వేషమే ఉండదు. మన భావము ఎలాంటిదో ఎదుటివ్యక్తిలో కూడా అలాంటి భావమే ప్రతిబింబిస్తుంది. "యద్భావం తద్భవతి". కనుక మనలో ఏమాత్రము ద్వేషము పెట్టుకోకూడదు.

ఆకాశంలో మేఘములు దండిగా ఉన్నప్పుడు సూర్యుడు కనిపించకుండా పోవచ్చు. కొంతసేపు ఓపికపడితే మేఘములు కదలిపోయి సూర్యుడు కనిపిస్తాడు. అదేవిధంగా, మన హృదయాకాశంలో అలముకున్న దుర్భావములనే దట్టమైన మేఘములు తొలగిపోయినప్పుడు

sri sathyasaivachanamrutam

నిర్మలమైన ప్రేమతత్త్వం ప్రకాశిస్తుంది. ప్రేమతత్త్వంచేత సర్వమూ మనం సాధించవచ్చు. యావత్ప్రపంచమునే మన హస్తగతం చేసుకోవచ్చు. అలాంటి ప్రేమతత్త్వాన్ని విస్మరించి నీవు ఉదయం, సాయంకాలము ధ్యానంలో కూర్చుంటున్నావు. కాని, ఏమి ధ్యానము చేస్తున్నావు? ఆ ధ్యానం ఎంతవరకు నిలుస్తుంది? క్షణమైనా నిలవటం లేదు. అన్నీ కదలిపోయే మేఘాలే. కాబట్టి ప్రాపంచిక సంబంధమైన విషయాల్లో నీవు ఎక్కువ ప్రవేశించవద్దు.

**భక్తచైతన్యుడు**

ఒకానొక సమయంలో చైతన్యమహాప్రభువు డోలు వాయిస్తూ 'రామ్ రామ్' అనుకుంటూ బజార్లో నృత్యం చేస్తూ పోతున్నాడు. కొందరు చూచి అతనిని పిచ్చివాడని భావించి ఆ డోలును పగలగొట్టారు. కాని, డోలు పోయిందే అని చైతన్యుడు బాధపడలేదు. తాళాలు కొడుతూ పాడుకుంటూ వెళ్ళసాగాడు. అసూయాపరులు ఆ తాళాలను కూడా తీసుకొని పారవేశారు. 'ఓహో! ఈ తాళాలు కొట్టటంకూడా భగవంతునికి ఇష్టం లేదేమో' అనుకున్నాడు చైతన్యుడు. దైవానికి ఇష్టమైనది మాత్రమే నిలుస్తుందన్న సత్యాన్ని గుర్తించాడు. 'ఓ భగవంతుడా! నీకు ఏది ఇష్టమో అదే నేను చేస్తాను. నీకు ఇష్టం కానిది నేను ఏమాత్రం ముట్టను' అన్నాడు. డోలును వాయించటం,తాళాలను కొట్టటం దైవానికి ఇష్టం లేదని భావించి వాటిని విసర్జించాడు. ప్రాకృతమైన సాధనలన్నీ మానివేశాడు. ప్రేమతత్త్వాన్ని అభివృద్ధిపరచుకున్నాడు. "స్వామీ! నాదగ్గర ఉన్నది ప్రేమతత్త్వం ఒక్కటే. దానిని నావద్దనుండి ఎవ్వరూ వేరు చేయటానికి వీలుకాదు" అన్నాడు. అలాంటి ప్రేమతత్త్వాన్ని మనం ఆశించాలి. ప్రాకృతమైనదానిని ఆశించి, అది పోతూనే మోసమైపోయిందని బాధపడితే ఏం ప్రయోజనం? 'నిర్గుణం నిరంజనం సనాతనం నికేతనం నిత్య శుద్ధ బుద్ధ ముక్త నిర్మలస్వరూపిణం' అట్టి ప్రేమనే మనం ప్రధానంగా తీసుకోవాలి. ప్రేమను మనం హృదయంలో పెట్టుకుంటే దానిని ఎవ్వరూ తీసివేయటానికి వీలుకాదు.

**'సాధన' అనగా ఏమిటి?**

ఇక్కడ ఒక కాగితం ఉంటున్నది. ఈ కాగితంపై నా పేరును కాగితమునుండి వేరుచేయటానికి వీలౌతుందా? కాదు. అదేవిధంగా మీ హృదయమనే పేపరుపైన ప్రేమతత్త్వమనేది ప్రింటైపోవాలి; రెండింటిని వేరు చేయటానికి వీలుకాదు. అలాంటి ప్రేమతత్త్వానికి మీరు పూనుకోండి. "అడవులయందున్న, ఆకసముననున్న, పట్టణముననున్న,

srisathyasaivachanamrutam

పల్లెనున్న, గుట్టమీదనున్న, నట్టేటబడియున్న.... ఎక్కడున్నప్పటికీ మిమ్మల్ని కాపాడేది దైవప్రేమ ఒక్కటే. అట్టి ప్రేమను మీరు చిక్కించుకోండి. అదే నిజమైన సాధన. 'సా' అనగా సాలోక్యము, సామీప్యము, సారూప్యము, సాయుజ్యము. ఈ నాల్గుతత్త్వములతో కూడినదే నిజమైన సాధన. చాలామంది పెద్దపెద్ద పుస్తకాలు చదువుతూ ఉంటారు. కాని కేవలం పుస్తకాలను చదివినంతమాత్రాన వచ్చే ఫలితమేమి లేదు. మస్తకంలో ఉన్నవి పుస్తకంలోకి వచ్చాయి. పుస్తకంలో ఉన్నవాటిని మీరు మరల మస్తకంలోకి చేర్చుకుంటున్నారు. ఈవిధంగా, పుస్తక మస్తకములు రెండూ ఒకటైపోతున్నాయి. దానివలన కలిగే ప్రయోజనమేమిటి? పుస్తకము, మస్తకము రెండింటినీ త్యజించి మీ హృదయంలో ప్రేమను నింపుకోండి. అది ఏనాటికీ మార్పు చెందదు.

### దైవప్రేమను ఆశించండి, ఆరాధించండి

దివ్యాత్మస్వరూపులారా! ఆత్మ దివ్యమైనది. అట్టి ఆత్మత్త్వాన్ని గుర్తించండి. కొంత మందికి భౌతికమైన సాధనలలో కొంత ఆనందము కల్గుతుంది. కాని ఆ ఆనందము భౌతికమైనదే. "కాయము పాంచభౌతికము కాయము కాలకతప్పదెప్పుడున్..." కాయముతో కలిగినవి కాయముతోనే పోతుంటాయి. కాని, ఎంతో కాలము సంబంధ బాంధవ్యాలను పెంచుకోవటంచేత కాయము పోయినప్పుడు ఎంతో బాధపడుతుంటాం. ఇది సహజమే! ఇవన్నీ వస్తుంటాయి, పోతుంటాయి. ఇలాంటి వచ్చిపోయేవాటిని మనం పట్టుకోకూడదు. ఏది నిత్యమో, ఏది సత్యమో దాన్ని మనం పట్టుకోవాలి. భగవంతుని ప్రేమ ఒక్కటే నిత్యసత్యమైనది. అది ఇట్టిది, అట్టిది అని ఎవ్వరూ వర్ణించలేరు. అది అనంతంగా వస్తుంది. ప్రాపంచికమైన, దేహసంబంధమైన ప్రేమ అప్పటికప్పుడు వస్తుంది, పోతుంది. అది Comes and goes. కాని, నిజమైన ప్రేమతత్త్వము హృదయంనుంచి వస్తుంది. అది Comes and grows (వస్తుంది, పెరుగుతుంది). ఎప్పటికీ తరగదు. అట్టి నిజమైన ప్రేమతత్త్వాన్ని పట్టుకోండి. అది ఎవ్వరూ అమ్మేది కాదు. అది దైవము దగ్గర తప్ప ఇంకొకరి దగ్గర లభించదు. అది చిక్కిన తరువాత మీరు దేనినీ కోరరు; ఏదీ మీకు అవసరముండదుకూడా. అలాంటి ప్రేమతత్త్వానికి మీరు దగ్గరగా ఉంటుండి కూడా దానిని ఎందుకు కోరుకోవడం లేదు?

sri sathyasai vachanamrutam

ప్రాపంచికమైన, దేహసంబంధమైన ప్రేమే శాశ్వతమని భావించి మీరు దేహముతో ఆడుతూ పాడుతూ అదియే ఆనందమని భ్రమిస్తున్నారు. అది ఎప్పటికి ఆనందము కాదు అదియే ఏనాటికి శాశ్వతము కాదు శాశ్వతమైనది దైవప్రేమ ఒక్కటే. ఈ సత్యాన్ని గుర్తించి నచికేతుడు సర్వమూ త్యజించాడు. ఏ కోరికలూ లేకుండా తన మనస్సును నిశ్చలంగా నిల్పుకున్నాడు. ఈ లౌకికమైన ప్రేమలన్నీ క్షీణించేవే! క్షీణించని ప్రేమ దైవప్రేమ ఒక్కటే. అట్టి దైవప్రేమను ఆశించండి, ఆరాధించండి. ఎప్పటికీ మీరు ఆనందంగానే ఉంటారు. భౌతికమైన ప్రేమ పుట్టుతుంది, గిట్టుతుంది. కాని దైవప్రేమ పుట్టేది కాదు, గిట్టేది కాదు. దైవప్రేమే సత్యం. ఏది మారినా అది మారదు. అట్టి మార్పుచెందని సత్యాన్ని మీరు పూజించండి, ఆరాధించండి. అదే నిజమైన మోక్షం. మోక్షమంటే ఏమిటి? మోహక్షయమే మోక్షం. ఈ దేహసంబంధమైన మోహాన్ని త్యజించాలి. అది త్యజించిన తక్షణమే మనకు పరిపూర్ణమైన వైరాగ్యము కలుగుతుంది. కనుక మోక్షము కావాలంటే ప్రేమతత్త్వమే ప్రధానం.

**ఉభయభారతి జ్ఞానబోధ**

ఆదిశంకరులవారు దిగ్విజయయాత్ర సల్పుతూ ఒకపర్యాయం మండనమిశ్రుడనే పండితునితో వాదోపవాదములకు పూనుకున్నారు. ఓడినవారు గెలిచినవారికి శిష్యుడు కావాలన్నది వారి నియమం. మండనమిశ్రుని ధర్మపత్ని ఉభయభారతి. ఆమె సకల జ్ఞానసంపన్నురాలు. అందుచేత ఆమెను జడ్జిగా పెట్టుకొని వాదోపవాదములు సల్పారు. ఉభయభారతి తన భర్త ఓడిపోయినాడని తీర్పు చెప్పింది. మండనమిశ్రుడు తాను చేసిన ప్రతిజ్ఞను అనుసరించి సన్యాసం స్వీకరించి శంకరులవారికి శిష్యుడైనాడు. ఉభయభారతికూడా సన్యాసం స్వీకరించి గంగానదికి సమీపంలో ఒక ఆశ్రమమును నిర్మించుకొని స్త్రీలకు జ్ఞానబోధలు సల్పుతూ వచ్చింది.

ప్రతి రోజూ తెల్లవారుఝామునే ఆమె తన శిష్యురాండ్రతో కలిసి గంగానదికి వెళ్ళి స్నానమాచరించి వచ్చేది. వాళ్ళు వెళ్ళే మార్గములో ఒక చెట్టుక్రింద ఒక సన్యాసి నివసించేవాడు. ప్రజలు అతనిని 'బ్రహ్మజ్ఞాని' అని పిలిచేవారు. ఒకనాడు అతను తాను నీరు త్రాగడానికి ఉపయోగించే బుఱ్ఱను ఎవరైనా దొంగిలిస్తారేమో అన్న భయంచేత తలక్రింద పెట్టుకొని పడుకున్నాడు. 'అతడు మహాజ్ఞాని' అని చెప్పింది శిష్యురాలు. 'అతనిది కేవలం భౌతిక జ్ఞానమేగాని,

దివ్యమైన జ్ఞానము కాదు. నిజంగా అతను జ్ఞాని అయితే నీటిబుఱ్ఱను ఎందుకు తలక్రింద పెట్టుకోవాలి? బుఱ్ఱపై తాను మమకారం వదులుకోలేదే' అని ఉభయభారతి అతనికి వినిపించేటట్లుగా పలికింది. అతనికి కోపం వచ్చింది. వాళ్ళు గంగలో స్నానమాచరించి తిరిగి వస్తూండగా అతడా బుఱ్ఱను తీసి విసిరేశాడు. అది చూసి 'అతనికి కేవలం మమకారమే కాదు, అహంకారంకూడా ఉన్నది' అని పలికింది ఉభయభారతి. అప్పుడా సన్యాసి తన పొరపాటును గుర్తించి ఆమె పాదాలపై పడ్డాడు.

**నిత్యసత్యమైన జ్ఞానము**

ఈవిధంగా ఉభయభారతి అనేకమందిలో పరివర్తన కలిగిస్తూ వచ్చింది. ఆమె తలచేదీ, చెప్పేదీ, చేసేదీ మూడూ ఒక్కటే. అందువల్లనే ఆమె అందరికి గురువుగా మారిపోయింది. "మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనాం" అన్నారు. ఎవరైనా సరే అజ్ఞానమును దూరం చేసి ప్రేమతత్త్వమును అభివృద్ధిపరచేవారే నిజమైన గురువు. మనోనాశనం గావించేవారే నిజమైన గురువు. ఒక్క దైవాన్ని తప్ప దేనినీ మనం ఆశించకూడదు. అట్టి జ్ఞానమే నిత్యసత్యమైన జ్ఞానము.

అటువంటి జ్ఞానులు లోకంలో ఎందరో ఉంటున్నారు. "జగతియందు పుణ్యపురుషులు లేకున్న జగములెట్లు వెలుగు పగలుగాను?" అటువంటి జ్ఞానులు ఉన్నారు కాబట్టే, ప్రపంచమంతా వెలుగుతూ ఉంది. ఏకత్వం జ్ఞానం. అనేకత్వం అజ్ఞానం. జ్ఞానమనేది ఒకరినుండి లభించేది కాదు. కేవలం భగవత్ప్రేమచేతనే లభిస్తుంది. మనం అడుగవలసింది ఆత్మనేగాని మరొకదానిని కాదు. భిక్షగాడు ఇంటి ముందు నిలిచి, 'భవతి భిక్షాం దేహి' అంటాడు. తనకు భిక్షం పెట్టమని దేహిని అడుగుతున్నాడుగాని, దేహాన్ని అడగటంలేదు. ఈవిధమైన చిన్నచిన్న ఉపమానాలతోనే మనము జ్ఞానాన్ని అభివృద్ధిపరచుకోవచ్చు. ఈ లోకంలో మనం చదివే చదువులు మనకు ఆత్మజ్ఞానమును అందించలేవు.

*ఎమ్మేలు బియ్యేలు ఏర్పడ చదివియు*
*పేరు గాంచిన పెద్దవారలైన*
*సంపదలుండియు సద్దానపరులయి*
*పుడమి కీర్తిని గన్న పుణ్యులైన*

sri sathyasai vachanamrutam

*ఆయురారోగ్యంబులనవరతంబుండి*
*పరిపూర్ణ బలులగువారలైన*
*సతతంబు జపములు తపములు చేయుచు*
*వేదంబులను నేర్పు విప్రులైన*
*సాటిరారు భక్తులకు ఏనాటికైన*

లౌకికవిద్య లౌకికమైన జీవితానికి ఉపయోగపడుతుంది. ఆధ్యాత్మికవిద్య ఆత్మతత్త్వాన్ని బోధిస్తుంది. కాబట్టి దేహభ్రాంతి ఉన్నంతవరకు ఈ లౌకికవిద్య ఉండవలసినదే. దాన్ని వదలకూడదు. అది 'నెగెటివ్,' ఆత్మవిద్య 'పాజిటివ్'. విద్యార్థులారా! నెగెటివ్ కదా అని లౌకికవిద్యను మీరు విసర్జించకూడదు. లౌకికవిద్యలో కూడా మీరు ఉత్తీర్ణులు కండి. అయితే, నిజమైన జ్ఞానం ఆత్మజ్ఞానమే. దీన్ని పెట్టుకొని దాన్ని త్యజించండి.

## ఎవరు నిజమైన భక్తులు?

నేను రాత్రి ఒంటిగంటకు ఇక్కడకు వచ్చాను. కైలాసమునుండి లింగాలు వచ్చింది ఆ ముహూర్తమునందే. వాటంతటవ అవే వస్తాయి, పోతాయి. ఆ సమయంలో అవి వచ్చినప్పుడు నేను లేచాను. ఇక్కడికి వచ్చాను. చూశాను. భక్తులు, విద్యార్థులు అందరూ ఆనందంగా పాడుతున్నారు. కాని ఎట్టివారు భక్తులుగా కనిపించారు? నిశ్చలమైన మనస్సుతో నిర్మోహముచేత స్వామిని తలుచుకుంటూ ఉండటమే నిజమైన భక్తి. ఈ హాలులో వేలాదిమంది కూర్చున్నారు. కాని, అందరూ భక్తులు కారు. దేహము కూర్చుందిగాని, మనస్సు భగవంతునిపై లేదు. ఎక్కడైనా కూర్చోండి, మీ దృష్టి దైవముపై ఉంటే అక్కడనే మీకు దైవత్వము ప్రాప్తిస్తుంది. నిద్ర వస్తే నిద్రపోవచ్చు. నిద్రలోకూడా భగవత్తత్త్వం పెట్టుకోండి.

*మరపుతెర పడకుండ నిరతము జాగ్రత్స్వప్నసుషుప్తులలో*
*అరమరలు లేకుండ తరచుగ జీవాత్మ చదివెడి*
*తారకము మాటెరుగవలెనన్నా!*
*సద్గురుని కృపచే తారతమ్యము తరచి కనుమన్నా!*

ఏసమయమందైనా దైవత్వమును మనస్సులో పెట్టుకొని ఉండాలి. దైవత్వంపైన ప్రేమ ఉండబట్టే మీరు ఇంత దూరం వచ్చి భజనలో పాల్గొన్నారు. లేకపోతే మీ బెడ్‌రూమ్‌లో చక్కగా



sri sathyasai vahamrutam

పడుకునేవారు. అన్ని సౌకర్యాలను త్యజించి వచ్చి చెట్ల క్రింద కూర్చొని దైవత్వమును స్మరిస్తున్నారు. నిజమైన భక్తులకు ఏ అనుకూలములూ అక్కరలేదు, ఏ ఆహ్లాదమూ అక్కరలేదు. అలాంటి భక్తులే స్వామితత్త్వముతో ఏకత్వమును అనుభవిస్తారు. కనుక ఎక్కడికి పోయినప్పటికీ మీ మనస్సును స్వాధీనంలో పెట్టుకోవాలి. భౌతికమైన సుఖాలపై మనస్సును మరల్చకూడదు.

("ఓం నమశ్శివాయ..." అన్న పంచాక్షరీ మంత్రమును కొద్దిసేపు భక్తులచే ఉచ్చరింపజేసిన తరువాత శ్రీవారు తమ దివ్యోపన్యాసమును కొనసాగిస్తూ...)

బహిర్ముఖమైన శబ్దముతో 'ఓం నమశ్శివాయ', నెమ్మదిగా 'ఓం నమశ్శివాయ', శబ్దరహితంగా 'ఓం నమశ్శివాయ'. బహిర్ముఖంగా చెప్పినది ప్రపంచానికి చేరిపోతుంది. నెమ్మదిగా పలికినది నోటికి పరిమితమౌతుంది. శబ్దరహితంగా మనస్సుతో చేసిన చింతన సర్వత్రా వ్యాపించిపోతుంది. మనస్సుతో చేసే చింతనే నిత్యసత్యమైనది. అదే రాజమార్గము!

(2004 ఫిబ్రవరి 19వ తేదీ ఉదయం సాయికుల్వంత్‌లో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)

sri sathyasai vachanamrutam